క్లుప్తంగా

ఆదర్శ అవార్డులకు 36 మంది ఎంపిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆదర్శ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు చేసే వారిని ప్రోత్సహించే నిమిత్తం 36 మందిని ఎంపిక చేశామని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు రొక్కాల నాగబుజ్జి ఒక ప్రకటనలో తెలిపారు. సేవా అవార్డుల కోసం సమాజంలోని సాటి ప్రజల కోసం స్వచ్ఛందంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించిన వారి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు ఆహ్వానించగా 116 దరఖాస్తులు అందాయని పేర్కొన్నారు. ఈ నెల 25వ తేదీన తణుకులో నిర్వహించే కార్యక్రమంలో అవార్డులు అందజేస్తామని కమిటీ సభ్యులు గంజి సుగుణ రత్నకుమారి, జి.మధు, యు.దేవదాస్ తెలిపారు.

విద్యార్థులకు డ్రోన్ పైలట్ శిక్షణ



డ్రోన్ టెక్నాలజీలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులకు పాఠ్యప్రణాళికతో పాటు సాంకేతిక పరిజ్ఞానం తోడైతే ఉత్తమ స్థాయికి చేరుకుంటారని స్థానిక రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీధరరావు అన్నారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు డ్రోన్ పైలట్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇటీవల డ్రోన్ టెక్నాలజీ పలు రంగాల్లో ఉపయోగిస్తున్నారని, భవిష్యత్‌లో డ్రోన్ టెక్నాలజీ మరిన్ని రంగాల్లో విప్లవాన్ని తీసుకురాబోతోందన్నారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కె.సాయి రోహిత్, న్యూజెన్ ఐఈడీసీ కోఆర్డినేటర్ కె.వెంకటేష్ పాల్గొన్నారు.

పెసరకు పల్లాకు తెగులు



రైతులకు సూచనలిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్: పెసర పంటకు పల్లాకు తెగులు సోకిందని వ్యవసాయ సహాయ సంచాలకులు వై.సుబ్బారావు అన్నారు. శుక్రవారం పోణంగిలో నిర్వహించిన డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెసర పైరుపై తెల్లదోమ వల్ల సోకే పల్లాకు తెగుల నివారణకు లీటర్ నీటికి 1.6 మిల్లీలీటర్ మోనోక్రోటోఫాస్ లేదా రెండు మిల్లీలీటర్ల డైమిథోయేట్ పిచికారీ చేయచాలన్నారు. తెగులు సోకిన మొక్కలను వెంటనే పీకేయాలని అన్నారు. సస్య రక్షణ చర్యలు పాటిస్తే పెసరలో అధిక దిగుబడితో నికర లాభం సాధించవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఎ.జీవనసంధ్య, గ్రామ వ్యవసాయ సహాయకుడు సూర్య తదితరులు పాల్గొన్నారు.

మహాశివరాత్రికి నగరం ముస్తాబు

- శైవక్షేత్రాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- తెల్లవారుజాము నుంచే అభిషేకాలు



చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఏర్పాటుచేసిన టెంట్‌లు



పత్తేబాద శివాలయం ప్రాంగణం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నగరం ముస్తాబైంది. శైవ క్షేత్రాల్లో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్లు, తాగునీటి సౌకర్యం కల్పించారు. నీడ కోసం పందిర్లు వేశారు. పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం తెల్లవారు జామున 4 గంటల నుంచి ప్రత్యేక అభిషేకాలు, తైలాభిషేకాలు, సాయంత్రం స్వామి వారి భజన కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 6.48 గంటలకు శివజ్యోతి కార్యక్రమం, 7.29 గంటలకు స్వామి శాంతి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 10.26 గంటలకు లింగోద్భవ కాలంలో స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేయనున్నారు.

పవర్‌పేటలో..

కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 4 గంటలకు పంచామృతాలు, పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో మహారుద్రాభిషేకం నిర్వహిస్తారు. రాత్రి 8 నుంచి 12 గంటల వరకు లింగోద్భవ కాలంలో స్వామి వారికి 516 కేజీల పంచదారతో మహా శర్కరాభిషేకం చేస్తారు. రాత్రి 12 గంటలకు 27 హారతులతో స్వామి వారికి విశేష హారతి సేవ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేయనున్నారు.

దొండపాడులో..

శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో సర్వదోష పరిహారక విశ్వేశ్వర స్వామికి అహోరాత్ర మహాశివరాత్రి మహోత్సవం నిర్వహిస్తారు. ఉదయం 5 గంటలకు గణపతి పూజ, 6 గంటల నుంచి మహన్యాస పారాయణ, ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి ప్రదోష కాల అభిషేకాలు, లక్ష్మీగణపతి, నవగ్రహ, మృత్యుంజయ సహిత రుద్రహోమాలు, పూర్ణాహుతి నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పార్వతి కల్యాణం, లక్ష బిల్వార్చన, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో విశేష అభిషేకాలు చేస్తారు. రాత్రి 9 గంటల నుంచి తెల్లవారు జాము 4 గంటల వరకు భజన, దివ్యనామ సంకీర్తన, జాగరణ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అగ్రహారంలో..

గంగా, వింధ్యవాసినీ సమేత నగరేశ్వర స్వామి దేవస్థానంలో తెల్లవారు జాము 4 గంటల నుంచి 8 గంటల వరకు స్వామి వారికి అభిషేకాలు చేస్తారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన సౌకర్యం కల్పిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి తిరిగి అభిషేకాలు, అలంకరణ చేస్తారు. రాత్రి 7 గంటలకు స్వామి వారికి శాంతి కల్యాణం నిర్వహించి రాత్రి 10 గంటల నుంచి లింగోద్భవ కాలంలో రాత్రి 12 గంటలకు స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహిస్తారు.

- దక్షిణపు వీధి మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి, అగ్రహారం అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి, ఆదివారపు పేట పర్వతవర్ధని సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానాల్లోనూ విశేష పూజలకు ఏర్పాట్లు చేశారు.

ప్రసాద వితరణకు ఏర్పాట్లు

ఏలూరు (టూటౌన్): మహాశివరాత్రి సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని బలివే, పట్టిసీమ, తాడువాయి, కలిదిండిలలో భక్తులకు ప్రసాద వితరణ, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్టు తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి చౌదరి ఏలూరులోని తన కార్యాలయంలో శుక్రవారం తెలిపారు. బలివే శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయానికి వచ్చే భక్తులకు పెదవేగి మండలం విజయరాయిలోని బలివే అడ్డరోడ్డు వద్ద ప్రసాద వితరణ చేస్తామన్నారు. బ్రాహ్మణులచే మూడు రకాల ప్రసాదాలను వండించి, 50 వేల మందికి ప్రసాద వితరణతో పాటు మజ్జిగ ప్యాకెట్లు, మంచినీరు అందించనున్నట్టు చెప్పారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



వ్యక్తిత్వ వికాసం కార్యక్రమంలో మాట్లాడుతున్న మెహర్రాజ్

ఏలూరు రూరల్ : యువత ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహర్రాజ్ అన్నారు. శుక్రవారం ఏలూరు శనివారపుపేట జడ్పీ పాఠశాలలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. మెహర్రాజ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. కెరియర్ కౌన్సిలర్ ఆర్.విజయ కుమార్ మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం బి.రాజేశ్వరి, ఉపాధ్యాయులు కేఎస్‌వీకే రాజ్‌కుమార్, సెట్‌వెల్ మేనేజర్ పీవీఎస్ సత్యనారాయణ, ఏఓ కేజీ కెనడి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యానికి మేలు



ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

ఏలూరు రూరల్: యువతీ, యువకులు చిరుధాన్యాల ప్రాధాన్యతను తెలుసుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యువ అధికారి దూలం కిషోర్ అన్నారు. శుక్రవారం ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌వైకే ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిలెట్స్ 2023 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆహారంలో చిరుధాన్యాల ప్రాధాన్యతను ప్రజల్లో అవగాహన కల్గించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు మాట్లాడుతూ చిరుధాన్యాలల్లో ఫైబర్ ఎక్కువగా ఉండడం వల్ల తీసుకున్న ఆహారం త్వరితగతిన జీర్ణమౌతుందన్నారు. చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. తొలుత స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారిణులకు షూ బహూకరణ



దాతలు నుంచి షూ అందుకున్న క్రీడాకారిణులు

ఏలూరు రూరల్: బాస్కెట్‌బాల్‌లో రాణిస్తున్న ఏలూరు క్రీడాకారిణులకు దాతలు సుమారు రూ.32 వేల విలువ గల షూ బహూకరించారు. శుక్రవారం ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాలలో కాశీపట్నపు ఫౌండేషన్ రిటైర్డ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇందుపు శేఖర్‌రావు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. బాలికలు రాష్ట్ర, జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ క్రీడలో రాణిస్తున్నారని పలువురు కొనియాడారు. ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఎస్వీ సుబ్బారావు, హెచ్‌ఎం జి.సునీత, ఉపాధ్యాయులు ఎన్‌సీహెచ్ కృష్ణమోహన్, ఎంవీ సుబ్బారావు, పీడీ కె.మురళీకృష్ణ, ఎంవీఎల్ ప్రసన్న పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన



ఆరోగ్యంపై సూచనలిస్తున్న సీనియర్ వైద్యాధికారి సుభద్ర

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అమీనాపేట రిజర్వు పోలీస్ లైన్ నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఆయుర్వేద వైద్యశాల సీనియర్ వైద్యాధికారి కేఎల్ సుభద్ర మాట్లాడుతూ విద్యార్థులు నిరంతరం ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి యోగ చేయాలని సూచించారు. ఆయుష్ విభాగం ప్రతినిధి ఎండీ ఖాజ, యోగ ఇన్‌స్ట్రక్టర్ శివ విద్యార్థులకు యోగాసనాలను నేర్పించారు. ఈ సందర్భంగా వ్యాధినిరోధక శక్తి పెంపొందించే ఔషధాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఇజ్వాన్ అహ్మద్, ఉపాధ్యాయులు జి.రేణుకాదేవి, కేబీ సత్యకుమారి, జి.నాగేశ్వరరావు, టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంటల వివరాలను ఈకేవైసీలో నమోదు చేసుకోవాలి

బుట్టాయగూడెం: రైతులు తప్పనిసరిగా పంట వివరాలను ఈకేవైసీలో ఈ నెల 25లోపు నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ అన్నారు. మండలంలోని బూసరాజుపల్లి సమీపంలో ఉన్న రైతు పైడా జయరాజు మొక్కజొన్న పంటను, బుద్దులవారిగూడెం, కొల్లాయిగూడెంలోని కేరం వసంతరావు, కేరం కన్నయ్యల పంట పొలాల్లోని మొక్కజొన్న, పొగాకు పంటలను పరిశీలించారు. వారి సాగు విస్తీర్ణం వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని పంటల సాగు విస్తీర్ణం, ఈ–కేవైసీ నమోదు వివరాలను తెలుసుకునేందుకు పర్యటించనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా రైతులు 47 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం పంటలు ఆశాజనకంగానే ఉన్నాయని చెప్పారు. 1,28,000 ఎకరాల్లో రబీలో రైతులు వరి పంటను సాగు చేస్తున్నట్లు చెప్పారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి నాగేశ్వరరావు



చొదిమెళ్లలో దోమల నివారణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఏలూరు టౌన్: దోమల వ్యాప్తిని అరికట్టేందుకు పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా ఇన్‌చార్జి వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ నాగేశ్వరరావు అన్నారు. ఏలూరు 27వ డివిజన్ చొదిమెళ్ల గ్రామంలో కార్పొరేటర్ బత్తిన విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్యారోగ్యశాఖ సిబ్బందితో కలిసి దోమల నిరోధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల ద్వారా డెంగీ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు సోకుతాయని, దోమల నివారణకు పరిసరాల పరిశుభ్రత పాటించాలని డాక్టర్ నాగేశ్వరరావు సూచించారు. దోమలు అధికంగా మంచినీటి నిల్వ ప్రాంతాల్లో ఉంటాయని గృహ సముదాయాల్లో మూత లేని నీల్ల తొట్టెలు, డ్రమ్ములు, టైర్లు, కొబ్బరి బొండాలు, పూలకుండీలు, రుబ్బురోళ్లు, ప్లాస్టిక్ వస్తువులు వంటి వాటిలో పెరుగుతాయని అన్నారు. డెంగీ, మలేరియా పరీక్షలు ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా చేస్తామని తెలిపారు. కార్పొరేటర్ విజయ్‌కుమార్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, చెత్త వ్యర్థాలను డ్రెయిన్లలో వేయరాదని కోరారు. జ్వరం వస్తే ప్రభుత్వాసుపత్రి సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. అనంతరం ఇంటింటా కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, ఎంపీహెచ్‌ఈఓ ఆర్.వెంకట్రాజు, హెల్త్ అసిస్టెంట్ జోషి, ఎంఎల్‌హెచ్‌పీ ఆయేషా, ఏఎన్‌ఎంలు శ్యామల, సంధ్య, ఆశా కార్యకర్తలు సుందరమ్మ, ఉషారాణి, వలంటీర్లు ఉన్నారు.

క్షయ పట్ల అప్రమత్తం ఉండాలి

ప్రజలు క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, అశ్రద్ధ చేస్తే ప్రాణాంతకమని అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు తెలిపారు. టీబీ వారోత్సవాల్లో భాగంగా చొదిమెళ్లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రెండు వారాలకు పైబడి దగ్గు, కళ్లె పడటం, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం మొదలైన లక్షణాలుంటే టీబీ కావచ్చని వైద్యులను సంప్రదించాలని గోవిందరావు సూచించారు. ఈ వ్యాధి పట్ల అశ్రద్ధ చేస్తే కుటుంబ సభ్యులకు సైతం వ్యాధి సక్రమించే అవకాశం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు, టీబీ బారినపడే అవకాశం ఉందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	12	చిక్కుడు కాయలు	18
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	20	ములక్కాడలు	12-15
బెండకాయలు	40	కంద	44
పచ్చిమిర్చి	20	బీట్‌రూట్	28
కాకర కాయలు	22-28	కీరా దోస	30
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	54	అల్లం	70
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	24	పాలకూర	10
దొండకాయలు	26	చుక్కకూర	08
బంగాళదుంపలు	20	తోటకూర	08
ఉల్లిపాయలు	20	గోంగూర	08
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	32-40	బఠాణి	--
ఆనపకాయ (1)	20	క్యాప్సికమ్	54
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	24

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	34
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	35
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	19
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	14
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	20
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	33
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు - తిరుపతి	16.00	4830	30

పరీక్షలపై భయం పోగొట్టేందుకు కౌన్సెలింగ్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక బాలగంగాధర్ తిలక్ నగరపాలక సంస్థ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పరీక్షా పర్వ్ 4.0 కార్యక్రమాన్ని దూబచర్ల డైట్ కళాశాల లెక్చరర్ సీహెచ్ గోవింద రాజులు ఆధ్వర్యంలో నిర్వహించారు. మంచి మార్కుల సాధనకు సులువైన పద్ధతులను విద్యార్థులకు వివరించారు. పరీక్షలంటే ఉండే భయాన్ని పోగొట్టడానికి కౌన్సెలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కేవీ షడ్రక్ పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శుక్రవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. భీమడోలుకు చెందిన గుండాబత్తుల సత్యనారాయణమూర్తి దంపతులు ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

వంగ రైతులను ఆదుకోవాలి

ద్వారకాతిరుమల: మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించక నష్టపోతున్న వంగ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. మండలంలోని పంగిడిగూడెంలో రైతు సంఘ నాయకులు శుక్రవారం పర్యటించి, వంగ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ వంగ రైతులతో మాట్లాడి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూలి ఖర్చులు రాకపోవడంతో రైతులు వంగ పంటను కోయడం లేదన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు కట్టా భాస్కరరావు, గుర్రం రాంబాబు, గుర్రం పాపారావు తదితరులున్నారు.

శిశువు మృతదేహం లభ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక అంబికా రెస్టారెంట్ రోడ్డులో హైదరాబాద్‌లో నివశిస్తున్న సురేష్‌కు చెందిన శిథిలావస్థలో చేరిన ఇంట్లో నవజాత శిశువు మృతదేహాన్ని గుర్తించారు. సురేష్ హైదరాబాద్‌లో ఉండటంతో రెండేళ్లుగా ఆ ఇల్లు ఖాళీగా ఉంది. శుక్రవారం సురేష్ వచ్చి ఇంటి ఆవరణను శుభ్రం చేస్తుండగా వంటగదిలో వాష్ బేసిన్‌లో కుళ్లిన నవజాత శిశువు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై ఎం.సాగర్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుళ్లిన నవజాత శిశువు మృతదేహాన్ని 10 రోజుల క్రితం పడవేసి ఉంటారని భావిస్తున్నారు. ఘటనపై చుట్టుపక్కల వారి నుంచి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.


సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రామకోటి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం లలితా సహస్రనామ పారాయణ చేసి సామూహిక కుంకుమ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ప్రత్యేక పూజలు, నిత్య హోమం, స్వామి వారి నిత్య కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి విశేష అలంకరణ చేశారు. సాయంత్రం తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన ఆచార్య రంగా ప్రసాద్ ధర్మమే దైవం అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. రాత్రి ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

మహాయజ్ఞానికి శ్రీకారం



హోమం నిర్వహిస్తున్న గురుజీ

ద్వారకాతిరుమల: సుందరగిరిపై ఉన్న స్వయంభూ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం నిర్వహించనున్న మహాసంపుటిత లక్ష్మీనృసింహ ధన్వంతరీ 28వ మహాయజ్ఞానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఏటా మహా శివరాత్రి రోజున సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు ఈ యజ్ఞాన్ని నిర్వహిస్తారు. కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురుజీ (హైదరాబాద్) ఆధ్వర్యంలో నిర్వహించే ఈ యజ్ఞ ఏర్పాట్లను సీహెచ్ కుటుంబరావు పర్యవేక్షిస్తున్నారు. శుక్రవారం ఆలయ యాగశాలలో భారీ ఏర్పాట్లు చేశారు. అభిషేకానికి 1,331 కలశాలను సిద్ధం చేశారు. వివిధ రకాల శాలిగ్రామాలను పూజలకు సన్నద్ధం చేశారు. వివిధ దేవతామూర్తుల విగ్రహాలను యజ్ఞ నిర్వహణ ప్రాంగణంలో ఉంచారు. రుత్వికులు గర్భాలయంలో కొలువైన స్వామివారి మూలవిరాట్ వద్ద కంకణధారణ చేశారు. గురూజీ గణపతి పూజ, హోమం నిర్వహించారు. శాలిగ్రామారాధన, కలశ ప్రతిష్ఠాపన, సూర్య నమస్కారాలు, లక్ష తులసీ దళార్చన చేశారు. శనివారం రాత్రి లోక శాంతి కోసం నిర్వహించనున్న ఈ యజ్ఞం భక్తులను పరవశింప జేయనుంది. యజ్ఞ క్రతువును యూట్యూబ్ ద్వారా వీక్షించవచ్చని కుటుంబరావు తెలిపారు.